క్లుప్తంగా

15న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొల్లూరు : కొల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 15న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించడంతో పాటు అధ్యక్షురాలు ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. గురువారం మధ్యాహ్నం జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతోపాటు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

భట్టిప్రోలు ఎస్‌ఐగా శ్రీనివాసరావు



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎస్‌ఐగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాపట్ల వీఆర్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన అంబటి చంద్రశేఖర్ ప్రకాశం జిల్లా మేదరమెట్లకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు సిబ్బంది స్వాగతం పలికారు.

చుండూరు ఎస్‌ఐగా రఫీ



చుండూరు(వేమూరు): చుండూరు ఎస్‌ఐ గా మహ్మద్ రఫీ ఉద్యోగ బాధ్యతలు సోమవారం చేపట్టారు. స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కొత్త ఎస్‌ఐకి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అలకాపురం శివారు సత్యనారాయణపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణా తరగతులు ఇవ్వాలని సూచించారు.

స్పందనకు ఏడు అర్జీలు


రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. తమ గృహానికి కాలిబాట మార్గం చూపాలని పెరవలికి చెందిన గృహస్తులు అర్జీ అందించారన్నారు. కొల్లూరు మండలం అనంతవరం గ్రామంలో 318 సర్వే నంబరులోని డొంకను సర్వే చేయాలని అర్జీ అందగా, రేపల్లె పట్టణంలోని 17వ వార్డు నుంచి నివేశన స్థలం సర్వే సర్టిఫికేట్‌కై ఒక అర్జీ, మురుగు నీరు పారుదల సమస్యపై మరో అర్జీ అందిందన్నారు. 5వ వార్డు నుంచి ఇంటి పట్టా రీవెరిఫికేషన్‌కై ఒక అర్జీ, గృహ సమస్యపై మరో అర్జీ అందాయన్నారు. భట్టిప్రోలు మండలం ఓటేరు గ్రామంలో లంక భూములకు సంబంధించి పట్టా మంజూరుకై ఒక దరఖాస్తు అందిందన్నారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గుంటూరు వెస్ట్ డీఎస్పీగా మహేష్



గుంటూరు ఈస్ట్: నగర వెస్ట్ డీఎస్పీగా కె.వి.మహేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2018లో డీఎస్పీగా చేరిన ఆయన కర్నూలు టౌన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నరసరావుపేట నుంచి బదిలీపై గుంటూరు వెస్ట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు నియంత్రించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాత్రి గస్తీ విస్తృతం చేస్తామని చెప్పారు. ప్రజలు కూడా నేరస్తుల కదలికల్ని పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంటుందని చెప్పారు.

జన్ ఔషధి కేంద్రం ప్రారంభం



నెహ్రూనగర్: గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి(జనరిక్ మెడికల్ షాప్) కేంద్రాన్ని గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, సొసైటీ చైర్మన్ వై. భాగ్యలక్ష్మి సోమవారం ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు, వాటర్ ట్యాంకుల వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ డి. హరిగోపాలం, ఆఫీస్ మేనేజర్ కె. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

- నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేత



డ్వాక్రా మహిళలతో ఆసరా నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న వరికూటి అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించారని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును సోమవారం మహిళలకు అందజేశారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూల దండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. చుండూరు మండలానికి నాలుగో విడతగా మంజూరైన రూ.9.60 కోట్ల ఆసరా నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన అందించడం జరుగుతుందని చెప్పారు. పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ హయంలో అర్హత ఉన్న ఎంతో మంది పేదలకు పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. మళ్లీ సీఎంగా వైఎస్.జగన్ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, వరికూటి లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘురామిరెడ్డి, నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

సైకాలజిస్ట్ జంపాల విజయలక్ష్మి

వేమూరు: జీవితంలో ఉన్నత స్థానం పొందాలంటే మానసిక ఒత్తిడిని అధిగమించాలని ప్రముఖ సైకాలజిస్ట్ జంపాల విజయ లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయీభవ కార్యక్రమంలో భాగంగా 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అండ్ మోటివేషన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ధృఢంగా ఉండటం వల్ల మంచి ఫలితాలు సాధించడం జరుగుతుందని తెలిపారు. డాక్టరు మురళీ కృష్ణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఐ వెంకటేశ్వర్లు, రాజ్‌లాండ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంకుమార్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్, అధ్యాపకులు పి కోటేశ్వరరావు, రాజా కన్న, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం



డాక్టర్ కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

బాపట్ల అర్బన్ : విద్య, వైద్య రంగాల్లో బాపట్లకు విశేషమైన సేవలందించిన డాక్టర్ వై.ఎస్.కృష్ణమూర్తి చిరస్మరణీయులని ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.శరత్‌బోస్ అన్నారు. డాక్టర్ వై.ఎస్.కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా సోమవారం టౌన్ హాల్ లో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.శరత్ బోస్, ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాల్యాద్రిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల విద్యా కేంద్రంగా భాసిల్లడానికి కృషి చేసిన వారిలో డాక్టర్ కృష్ణమూర్తి అగ్రగణ్యులన్నారు. ఉన్నత విద్య అందుబాటులోకి రావడానికి డాక్టర్ కృష్ణమూర్తి కృషి మరువలేనిదన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులుగా బాపట్లకు విద్యా పరంగా ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. వైద్యుడిగా నాలుగు దశాబ్దాల పాటు బాపట్ల ప్రజలకు గణనీయమైన సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల వివరాలు నమోదు చేయండి

రేపల్లె రూరల్: పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకుగానూ 'నమస్తే ప్రోగ్రామ్' కార్యక్రమంలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.రామబోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్' పథకంలో భాగంగా వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్మికుల జీవన భద్రత మెరుగుతోపాటు ఉపాధి కల్పన పథకం ఉద్దేశ్యమన్నారు. దీంతో పాటుగా ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదైన కార్మికులు రెట్టింపు వైద్య సహాయం పొందవచ్చన్నారు. పిల్లల చదువులకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు అందజేయబడతాయన్నారు. సమావేశంలో నమస్తే ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఎస్.సురేంద్ర, సర్వేయర్ జీ.వందన, వాలిడేటర్ కే.మహేష్ తదితరులున్నారు.

క్రమశిక్షణతో కూడిన చదువుతో జీవితంలో ఉన్నతి

నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు



విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన చదువుతో జీవితంలో ఉన్నతస్థానానికి చేరుకోవచ్చని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. జీకేఆర్ హైస్కూల్ ఏటీ అగ్రహారం, పట్టాభిపురం క్యాంపస్‌లలోని టెన్త్ విద్యార్థులకు సోమవారం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రుల పెంపకం, ఉపాధ్యాయుల బోధనలో పాఠశాల విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళుతున్న విద్యార్థులు మంచి, చెడుల విచక్షణ తెలుసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మంచి స్నేహితుల్ని కలిగి ఉండటం మన అదృష్టమని, చెడు స్నేహాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోరాదని హితవు పలికారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో హుషారెత్తించారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త డి. తిరుపతిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ జి.కొండారెడ్డి, జి.జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎంలు శైలజారెడ్డి, సుశీలారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం



చెరుకుపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఎంతో ఆరోగ్యకరమని మండల వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరల స్టాల్‌ను ఏవో పరిశీలించారు. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకు కూరలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ గుడారు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ధ్వజస్థంభ ప్రతిష్ఠ



చెరుకుపల్లి: మండలంలోని కనగాల గ్రామంలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ పృద్వీశ్వర స్వామివారి దేవస్థానంలో నూతన జీవ ధ్వజ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చావలి జనతారావు సోమవారం చెప్పారు. ఈ నెల 12 నుంచి 15వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్వామి వారికి సోమవారం నూతన ధ్వజస్తంభ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలు సహస్ర ప్రతిష్ఠాచార్య బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో నిర్వహించటం జరుగుతుందన్నారు.

జీజీహెచ్‌కి సర్జికల్ పరికరాల అందజేత

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కి ఎస్క్యూఎల్ సర్జికల్స్ అధినేత కోటగిరి శోభన్‌బాబు సోమవారం రూ. 1.10 లక్షల విలువ గల బ్లడ్ కలెక్షన్ ట్యూబ్‌లు, సర్జికల్ గ్లౌజ్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు, పలువురు దాతలు ముందుకు వచ్చి సహాయం అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి, పక్కన ప్రజా ప్రతినిధులు, అధికారులు

నగరం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీ మోపిదేవి పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో పాలన ప్రజల ముంగిటకు చేరిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా నేరుగా ప్రజల ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరిందన్నారు. నాడు–నేడు కార్యక్రమం ప్రవేశపెట్టి ప్రభుత్వ వైద్యశాలలు, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తొలుత శాఖల వారీగా ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మాన్యం నాగమణి, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, పలు శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే కోన



చర్చి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: సంఘస్తులంతా ఐకమత్యంగా నూతన ప్రార్థనా మందిర నిర్మాణానికి పనులు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం మండల కేంద్రంలోని బొద్దు కూరివారిపాలెంలో లూథరన్ చర్చి నిర్మాణ శంకుస్థాపన ప్రార్థనలలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. చర్చి నిర్మాణానికి తనవంతు సహకారంగా సంఘ పెద్దలకు ఎమ్మెల్యే రూ.1లక్ష నగదు అందజేశారు. మరో లక్ష త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘస్తులు ఎమ్మెల్యే కోన రఘుపతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, చర్చి పాస్టర్ బాబు, సంఘ పెద్దలు సురేష్‌కుమార్, నిరీక్షణరావు, ధన్‌రాజు, భానుప్రకాష్, సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడైన గణపతి స్వామి



సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామిని పెండ్లి కుమారుడ్ని చేశారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 15న జరగనున్నది. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు ఆధ్వర్యంలో పంచాహ్నిక దీక్షతో ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి, తమిరిశ మారుతీల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రిజిస్ట్రేషన్‌లో ఆటంకాలు తొలగించాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లెరూరల్: ప్రభుత్వం పేదలకు అందజేసిన నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఆటంకాలు తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా సర్వర్లు సరిగా పనిచేయకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కూలీ పనులు చేసుకునే మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వచ్చి రోజంతా ఆయా కేంద్రాలలోనే ఉండి రిజిస్ట్రేషన్ కాక నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థిని ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు నమూనా ఎంపిక

ప్రత్తిపాడు: సైన్స్ ఎగ్జిబిషన్‌లో ముట్లూరు హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. జిల్లా కేంద్రం గుంటూరులోని డీసీఈబీలో సోమవారం జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టు పోటీలను నిర్వహించారు. పోటీల్లో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కొచ్చెర్ల శిరీష సోలార్ విద్యుత్తు ఉపయోగాలను వివరించే 'సోలార్ స్మార్ట్ బేబి క్రాడిల్' ప్రాజెక్టును తయారు చేసి ప్రదర్శించింది. ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ నెల 18న తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వి.ఎస్ రామాంజనేయులు, శ్రీనివాసరావులు తెలిపారు. విద్యార్థిని శిరీషతో పాటు సహకరించిన ఉపాధ్యాయులకు డీఈవో శైలజ, ఉప విద్యాధికారి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం జోస్‌మేరతలు అభినందనలు తెలిపారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి భూదందా



రజకుల శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి రోడ్డు కోసం కోసం చదును చేసిన భూమి



టీడీపీ నేత స్థలంలోకి వెళ్లటానికి ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మాణం చేస్తున్న రోడ్డు

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రజకుల శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి రోడ్డు నిర్మాణం

చేబ్రోలు: రజకులకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని స్థానిక టీడీపీ నేత రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఆక్రమించుకొని రోడ్డు నిర్మిస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. నారాకోడూరు గ్రామ పరిధిలో జీబీసీ రహదారి నుంచి కొద్ది దూరంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొంత భూమిని చదును చేసి ప్లాట్లు వేసే పనులు చేపట్టాడు. ఆ భూమికి రహదారి నిమిత్తం రెండు రోజులుగా పొన్నూరు వెళ్లే ప్రధాన రహదారి నుంచి సదరు టీడీపీ నేతకు చెందిన భూమి వరకు వెళ్లే స్థలంలో జేసీబీతో పిచ్చి మొక్కలు తొలగించి చదును చేసి రహదారి నిర్మాణం చేస్తున్నారు. రజకుల శ్మశాన వాటిక స్థలం, ఆర్‌అండ్‌బీకి చెందిన విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రోడ్డు నిర్మాణం చేస్తుండటంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా రజకుల శ్మశాన వాటిక స్థలంగా ఉన్న భూమిలోని కొంత బాగాన్ని ఆక్రమించుకోవటంతో పాటు జీబీసీ రహదారి నుంచి టీడీపీ నేతకు చెందిన భూమి వరకు ఉన్న ప్రభుత్వ భూమిని సైతం కబ్జా చేసి రోడ్డు నిర్మాణం చేస్తుండటంపై రజక సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

దీనిపై తహసీల్దారు రమాదేవిని సాక్షి వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదన్నారు. ఆక్రమణలపై వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం

తెనాలిటౌన్: భారత కోకిల సరోజని నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయ ఆడిటోరియంలో నవభారత్ నిర్మాణ సంఘం గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. పుణ్యభూమి నా దేశం నమో నమామి అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొన్నారు. పుణ్యభూమి నా దేశం శీర్షిక పేరిట పద్యపఠనం చేశారు. ప్రజ్ఞాచారి తన పద్యాలలో దేశ ఔన్నత్యం, దేశ భక్తి, పర్యావరణం, ప్రపంచశాంతి, తెలుగు భాష అభిమానం ప్రజల్లో పెంపొందే విధంగా ఆయా అంశాలను పొందుపరచి పద్యరచన చేశారు. న్యాయనిర్ణేతలు అతనిని ఎంపిక చేశారు. సాహితీ సంస్థల వ్యవస్థాపకులు కలిమి శ్రీ, గాంధీ నటరాజన్, తదితరులు ప్రజ్ఞాచారిని అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డికి ఘన స్వాగతం



గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి రమణకు స్వాగతం పలుకుతున్న బలసాని కిరణ్‌కుమార్, నాయకులు

గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి రమణకు పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. సోమవారం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయం నుంచి కార్లు, బైక్‌లపై భారీ ర్యాలీతో తాడేపల్లికి తరలి వెళ్లారు. అనంతరం ఎంపీ అభ్యర్థిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.